## క్లుప్తంగా

### ఏలూరికి సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

**ఖమ్మంమయూరిసెంటర్:** తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావును వసతిగృహ సంక్షేమ అధికారుల ఫోరం (హెచ్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన ఫోరం జిల్లా నూతన కమిటీ ఏలూరిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఏలూరి నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ... నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ప్రధాన బాధ్యతల్లో ఉన్న కార్యవర్గం ప్రాథమిక సభ్యుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధాకృష్ణ, హెచ్‌డబ్ల్యూల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు కోటపాటి రుక్మారావు, నాగేశ్వరరావు, టీఎన్జీవోస్ ఈసీ మెంబర్లు ఎండీ.అస్లాం, ఎస్.విజయ, ఫోరం ఉపాధ్యక్షులు కె.వీరభద్రరావు, కోమలి, బాధ్యులు మాధురి, ఎన్.నాగరాజు, సీహెచ్ నాగమణి, టి.స్టాలిన్, ఎం.వెంకటకృష్ణ, జై.నరసింహారావు, వసంత, కరుణాకర్, జి.వరలక్ష్మి, అబ్దుల్ ముఖిత్ పాల్గొన్నారు.

### బీమా చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న బ్రహ్మయ్య

**నేలకొండపల్లి:** మండలంలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన మాతంగి అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా తుడికి బీఆర్ఎస్ ఇన్సూరెన్స్ ఉన్నందున పార్టీ తరుపున రూ.2 లక్షల బీమా చెక్కును పార్టీ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య అందించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును పంపిణీ చేశారు. సొసైటీ డైరెక్టర్ నంబూరి సత్యనారాయణ, మహేష్, గుగులోత్ నాగయ్య, వెంకటనారాయణ ఉన్నారు.

### రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ఖమ్మంమయూరిసెంటర్:** దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమావేశాలు మార్చి 10 నుంచి 12 వరకు వేములవాడలో జరగనున్నాయని, ఈ సభలను జయప్రదం చేయాలని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ కోరారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహాసభల్లో దళిత హక్కులపై చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు తెలిపారు. 2014 నుంచి ఇప్పటి వరకు బడ్జెట్‌లో దళితులకు కేటాయిస్తున్న అంకెల్లో మార్పులు వస్తున్నాయి కానీ అమలుకు మాత్రం నోచుకోవడం లేదన్నారు. అంకెలు పెంచితే దళితులకు ఉపయోగం జరగదని కేటాయించిన నిధులు ఖర్చు చేస్తేనే ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో సమితి జిల్లా కన్వీనర్ వెంగళ ఆనందరావు, నాయకులు యోబు, గోపి పాల్గొన్నారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | సంక్రాంతికి వస్తున్నాం |
| వినోద | తండేల్ |
| సాయిరాం | జాబిలమ్మ నీకు అంత కోపమా |
| ఆదిత్య | డ్రాగన్ |
| శ్రీనివాస | చావా |
| సినీ గెలాక్సీ | రామం రాఘవం |

- ఖమ్మం గాంధీచౌక్

### ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 16 | బచ్చలికూర | 3 |
| వంకాయ | 24 | | 20 |
| బెండకాయ | 36 | పాలకూర | 3 |
| పచ్చిమిర్చి | 24 | | 20 |
| కాకర | 44 | చుక్కకూర | 3 |
| బీర | 48 | | 20 |
| దొండ | 34 | తోటకూర | 3 |
| పొట్లకాయ | 40 | | 10 |
| చిక్కుడు | 48 | గోంగూర | 4 |
| గోరుచిక్కుడు | 48 | | 20 |
| క్యాబేజీ | 20 | మెంతికూర | 3 |
| క్యాలీఫ్లవర్ | 30 | | 20 |
| ఆలుగడ్డ | 26 | కొత్తిమీర | 1 |
| చామగడ్డ | 48 | | 40 |
| క్యారెట్ | 26 | పుదీన | 1 |
| బీట్‌రూట్ | 34 | | 25 |
| క్యాప్సికం | 44 | -ఖమ్మం వ్యవసాయం | |

# ప్రారంభించకుండానే శిథిలం

**అలంకారప్రాయంగా మారిన షాదీఖానా**

- పశువులకు నిలయంగా మారుతున్న వైనం
- చోరీకి గురవుతున్న సామగ్రి



కూసుమంచిలో అలంకారప్రాయంగా ఉన్న షాదీఖానా

**కూసుమంచి:** మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం పక్కన 22 ఏళ్ల కిందట ముస్లిం కమ్యూనిటీ వివాహాలు, శుభకార్యాలకు నిర్మించిన షాదీఖానా భవనం ప్రారంభించకుండానే శిథిలమైంది. భవన నిర్మాణం అసంపూర్తిగా మారడంతో నేటి వరకు దాన్ని పట్టించుకున్న వారు లేరు. గత ప్రభుత్వాల్లో భవన మరమ్మతుల పేరుతో పలుమార్లు నిధులు మంజూరు చేసిన అట్టి పనుల తో రూపు మారలేదు. చివరకు ఈ భవనం పశువులకు నిలయంగా మారింది. భవనం ప్రారంభం కాకుండానే శిథిలం కాగా కిటికీలు, తలుపులు కొన్ని విరిగిపోగా మరికొన్ని చోరీకి గురయ్యాయి.

**తప్పని తిప్పలు..**

ఇదిలా ఉండగా పాత భవనాన్ని అందుబాటులోకి తీసుకురాకుండానే దాన్ని వదిలేసి దాని స్థానంలో మరిన్ని హంగులతో కొత్త భవనం నిర్మించాలనే ప్రతిపాదనను నాడు తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉండగా పలువురు ముస్లింలు కోరారు. దీంతో రూ.50 లక్షలతో నూతన భవనం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ నేటి వరకు దాని ఊసే లేదు. దీంతో ముస్లింలకు ఉన్నది అందుబాటులోకి రాక, కొత్తది నిర్మాణం చేపట్టాక తమ శుభకార్యాలను నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రస్తుత పాలేరు ఎమ్మెల్యే, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించి ఈ సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు. కనీసం ఈ భవనాన్ని ఇతర ప్రజా అవసరాలకైనా వినియోగంలోకి తేవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

**వృథాగా నిధులు..**

ఈ భవన నిర్మాణానికి 2003లో అప్పటి ప్రభుత్వంలో రూ.5 లక్షలు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. కాగా భవనంలో పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదని దాన్ని అలాగే వదిలేశారు. దానికి విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాల్లో పలుమార్లు భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిధులు కూడా మంజూరు చేశారు. అయినా భవనం ప్రారంభానికి గ్రహణం వీడలేదు. దీంతో లక్షలాది రూపాయలు వృథాగా పోయాయి తప్పా భవనం మాత్రం వినియోగంలోకి రాకుండా పోయింది. ప్రస్తుతం ఈ భవనం పశువులకు ఆవాసంగా మారింది.



శిథిలమవుతున్న భవనం

**అందుబాటులోకి తీసుకురావాలి..**

కూసుమంచిలోని షాదీఖానాను అందుబాటులోకి తీసుకొచ్చి ముస్లింలకు ప్రయోజనం కలిగేలా చూడాలి. మండల కేంద్రంలో షాదీఖానా లేక పేద ముస్లింల వివాహ, శుభకార్యాలకు ఇబ్బందులు పడుతున్నారు. షాదీఖానా ఉంటే ఎంతో మేలు కలుగుతుంది.

– షేక్ మీరా, కూసుమంచి

**మంత్రి దృష్టి సారించాలి..**

మండల కేంద్రంలో 22 ఏళ్ల క్రితం నిర్మించిన షాదీఖానా అసంపూర్తిగా ఉండటంతో అది ప్రారంభం కాలేదు. మండల కేంద్రంలో షాదీఖానా అవసరం ఎంతైనా ఉంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించి దాన్ని అందుబాటులోకి తేవాలి. లేకుంటే వేరొక చోట కొత్తది మంజూరు చేయించాలి.

– మహ్మద్ షంషుద్దీన్, కూసుమంచి

# కృష్ణా జలాల వివాదం పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాంబాబు

**ఖమ్మంమయూరిసెంటర్:** కృష్ణా జలాల వివాదాన్ని సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం, నాగార్జునసాగర్ నీటి కేటాయింపులపై ఏర్పడిన వివాదం ఉభయ తెలుగు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అలాకాకుండా కేంద్ర జోక్యం చేసుకుంటే సమస్య మరింత జఠిలం అవుతుందన్నారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు నీటి సరఫరాలో వారబందీ సడలించి రెండు వారాలు నీటి సరఫరా, ఒక్క వారం నిలుపుదల పద్ధతి అనుసరించాలన్నారు. జిల్లాలో ధాన్యం బోనస్ పెండింగ్‌లో ఉన్న రూ.65 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కె.మీరా, దుగ్గి కృష్ణ, బిక్కసాని గంగాధర్, శీలం సత్యనారాయణరెడ్డి, మల్లెంపాటి రామారావు, బాణాల శ్రీనివాసరావు, కుసుపూడి మధు తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్యంతో సమాజ వికాసం



సమావేశంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు

**ఖమ్మంగాంధీచౌక్:** సాహిత్యం సమాజం వికసిస్తుందని ఉదయ సాహితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కవి, రచయిత దాస్యం సేనాధిపతి అన్నారు. ఆదివారం స్థానిక బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో ఉదయ సాహితి (సాహిత్య వికాస వేదిక) రాష్ట్ర సర్వ సభ్య సమావేశం సంస్థ అధ్యక్షులు దాస్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సేనాధిపతి మాట్లాడుతూ.. సాహిత్యంలో సమాజ మార్పు కోరే రచనలు రావాలన్నారు. అనంతరం నగునూరి రాజన్న రాసిన 'వెలుగు పూలు'(హైకూలు) పుస్తకాన్ని, యర్రాబత్తిన మునీంద్ర రాసిన 'కలల కావడి' కవితా సంపుటిని అతిథులు ఆవిష్కరించారు. ముందుగా సంస్థ కార్యదర్శి వురిమళ్ల సునంద కార్యదర్శి నివేదికను వినిపించారు. ఈ సమ్మేళనంలో అర్హులైన కవులకు కవితా భూషణ, కవితా విభూషణ, సహస్ర కవితా స్ఫూర్తి అవార్డులను ప్రదానం చేశారు. రచయితలు వెంకటలక్ష్మీ, బత్తిన గీతాకుమారి, అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్, రచయిత్రి తాళ్లూరి లక్ష్మీ, ఉదయ సాహితి సభ్యులు రమాదేవి, కులకర్ణి, మూర్తి శ్రీదేవి, తులసి, వెంకటరమణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### నీటిని పొదుపుగా వాడుకోవాలి



పొలాల్ని పరిశీలిస్తున్న ఏఓ

**కూసుమంచి:** ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురికాగా సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా రైతులు సమన్వయంతో సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఏఓ వాణి అన్నారు. కూసుమంచి గ్రామంలోని నర్సింహులగూడెం రెండోదశ ఎత్తిపోతల పథకం కింద సాగుచేసిన వరి పొలాలను ఆదివారం ఏఓ పరిశీలించారు. త్వరలో ఎత్తిపోతల పథకం మరమ్మతులు పూర్తవుతాయని, ఇరిగేషన్, వ్యవసాయశాఖ సమన్వయంతో రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఏదేమైనా.. ముక్క కొరకాల్సిందే..





చికెన్ మేళాకు హాజరైన ప్రజలు

- చికెన్ మేళాలో బారులు దీరిన జనం

**ఖమ్మంవ్యవసాయం:** బర్డ్ ఫ్లూ ప్రచారం నేపథ్యంలో ఆదివారం ఖమ్మం నగరంలో చికెన్ మేళా నిర్వహించారు. వెన్‌కాబ్ సంస్థ (వెంకటేశ్వర హేచరీస్) ఆధ్వర్యంలో నగరంలోని శ్రీనివాస నగర్‌లో చికెన్ మేళా నిర్వహించారు. 2 క్వింటాళ్ల చికెన్ ఫ్రై, 2 వేల గుడ్లను ఈ మేళాలో పంపిణీ చేశారు. ప్రజలు బారులుదీరి కోడిగుడ్లను తీసుకెళ్లారు. పలువురు కుటుంబాలతో సహా వచ్చి మరీ చికెన్, గుడ్లు తీసుకొని అక్కడే తినగా కొందరు ఇళ్లకు తీసుకెళ్లారు. ఫౌల్ట్రీ పరిశ్రమ నిర్వాహకులు, చికెన్ వ్యాపారుల అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ బాబూరావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకాబ్ సంస్థ ప్రతినిధులు రాము, మహేష్, రుషి, అశోక్, వంశీ పాల్గొన్నారు.

### ఆర్థికసాయం

**ఖమ్మం మామిళ్లగూడెం:** ఖమ్మం 47వ డివిజన్‌కు చెందిన ఎనుగుల జలపతి రెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా దహన సంస్కారాలకు ఆదివారం డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట రామారావు ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. జలపతిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మధుసూదన్ రెడ్డి, ఘంటసాల గోపాల్, సత్రు, ఖాజా, రవి తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**కామేపల్లి:** ముచ్చర్ల జీపీలోని ఎంజేపల్లి హైస్కూల్ ఆవరణలో గ్లెన్‌ఈగల్స్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గూడురు కార్తీక్ రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ జాటోత్ జాచ్‌లూసీ, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

### నేడు మెగా క్యాంప్

**ఖమ్మం మామిళ్లగూడెం:** ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం దగ్గర గల షిఫా హాస్పిటల్‌లో సోమవారం ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు ఆరీఫ్, అస్మా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాస్పిటల్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రస్తుతం వారి ఆస్పత్రిలో ఒక ఓపీ తో ముగ్గురు డాక్టర్లను సంప్రదించవచ్చని, ఈ అవకాశం ఈనెల 25 నుంచి వచ్చే మార్చి 31 వరకు ఉంటుందని తెలిపారు.

### పరామర్శ

**నేలకొండపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి ఆదివారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించి. ఇటీవల మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. నాయకులు భద్రయ్య, మాజీ సర్పంచ్‌లు మస్తాన్, మానుకొండ శ్రీనివాసరావు, గంజికుంట్ల వెంకన్న, మానుకొండ వెంకటేశ్వరరావు, సుల్తాన్ వీరబాబు, ఎస్.కె.మధార్, మహేష్ పాల్గొన్నారు.

### నివాళి

**తిరుమలాయపాలెం:** మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న పిండిప్రోలు గ్రామానికి చెందిన కొండమీది కళావతి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందగా డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్ ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులు రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. ఏజెన్సీ ఆదిత్య ఎంటర్ ప్రైజస్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ గోపి రూ.10 వేలు అందించారు. ఆస్పత్రి సూపర్‌వైజర్ కుమారి తోటి కార్మికులు నివాళులర్పించారు.

**నేలకొండపల్లి:** మండలంలోని మోటాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఏలూరు సురేష్ మృతిచెందగా రాష్ట్ర మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి నివాళులర్పించారు. ఆయన వెంట వెన్నపూసల సీతారాములు, సీడీసీ డైరెక్టర్ మధు, వెంకటేశ్వర్లు, బెల్లం వాసు, తదితరులు ఉన్నారు.

# సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



స్థల దాతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

**కామేపల్లి:** గిరిజనుల ఆరాధ్యదైవం సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆదర్శంగా తీసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో భాగంగా భోగ్ బండారో, పూజా కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రకృతి, అడవుల సంరక్షణ, అన్ని సామాజిక వర్గాల సమానత్వానికి సేవాలాల్ కృషి చేశారని, సేవాలాల్ ప్రకృతి ప్రేమికుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అనంతరం సేవాలాల్ ఆలయ నిర్మాణానికి స్థలాన్ని వితరణగా అందించిన ఈరబోయిన మదార్ దంపతులను ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించి అభినందించారు. కామేపల్లి మండల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన మండలంలో బీటీ రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, సొసైటీ ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, ధరావత్ అనురాధ, మాలోత్ సరిరాంనాయక్, సుజాత, బావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# యూజీడీ పనుల పరిశీలన..



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం నగరంలో అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదివారం పరిశీలించారు. ఖానాపురం చెరువు వద్ద ప్రారంభించిన పనులను పరిశీలించిన కమిషనర్ పనుల వివరాలను పబ్లిక్ హెల్త్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖానాపురం చెరువు నుంచి ధంసలాపురం చెరువు వరకు 9 కిలోమీటర్ల మేరా యూజీడీని నిర్మించనున్నట్లు తెలిపారు. మురుగునీటిని ఖానాపురం చెరువు, లకారం చెరువుల్లోకి వెళ్లకుండా ధంసలాపురం చెరువు వరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీతో మురుగు నీటిని తరలిస్తున్నట్లు తెలిపారు. ధంసలాపురం చెరువులో మురుగునీరు కలవకుండా ఎస్టీపీని ఏర్పాటు చేసి దాంతో నీటిని శుద్ధి చేసిన తర్వాత చెరువులోకి కలపడం జరుగుతుందన్నారు. మురుగునీరు చెరువుల్లో కలవకుండా ప్రతీ చెరువుకు ఎస్టీపీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక ఎస్టీపీని ధంసలాపురం చెరువు వద్ద మరొకటి పుట్టకోట చెరువు వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



నేలకొండపల్లి: పోలీస్‌స్టేషన్ నుంచి పేపర్లు తీసుకొస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి

**నేలకొండపల్లి:** సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష విజయవంతమైంది. నేలకొండపల్లి గురుకుల బాలికల పాఠశాల కేంద్రంలో 477 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా 471 మంది హాజరయ్యారు. పరీక్ష పేపర్లను పోలీస్‌స్టేషన్ నుంచి బందోబస్తు నడుమ కేంద్రానికి తీసుకొచ్చారు. పరీక్షలను డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ మల్లయ్య, చీఫ్ సూపరిండెంట్ యం.పద్మావతి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఇన్విజిలేటర్లు, సిబ్బంది పాకనాటి కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రఘునాథపాలెం:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిగిలిన సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11 గంటల నుండి ఒంటిగంట వరకు ఖమ్మం ఇల్లెందు ప్రధాన రోడ్డు కేసీఆర్ కాలనీకి ఎదురుగా ఉన్న గాయత్రి బిల్డింగ్‌లో ఉన్న గిరిజన ప్రతిభా పాఠశాలలో కేటాయించిన కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి తెలిపారు. మొత్తం 352 మంది విద్యార్థులను కేటాయించగా 340 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



రఘునాథపాలెంలో..

### నీరు విడుదల చేయాలని రైతుల ధర్నా



ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

**ఖమ్మంరూరల్:** మండలంలోని తల్లంపాడులో పంటలు ఎండిపోతున్నాయని వెంటనే ఎస్ఆర్ఎస్పీ కాల్వల్లో భక్తరామదాసు నీరు విడుదల చేయాలని కోరుతు రైతులు ఆదివారం సూర్యాపేట–ఖమ్మం ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... వేసవిలో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలు వేశామని ప్రస్తుతం బావులు, బోర్లలో నీరు లేక ఎండిపోతున్నాయన్నారు. అధికారులు కల్పించుకుని భక్తరామదాసు నీటిని విడుదల చేసి చెరువులను నింపి పంటలకు కాపాడాలన్నారు.

### రాజకీయాలకతీతంగా మైనార్టీ జేఏసీ ఏర్పాటు

**ఖమ్మం రూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో రాజకీయాలకతీతంగా మైనార్టీ జేఏసీ ఏర్పాటు చేయాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం మైనార్టీ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. మైనార్టీల అభ్యున్నతికి సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహ్మామద్ గౌస్ తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

### జేఈఈ ఫలితాల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

**ఖమ్మం సహకారనగర్:** జేఈఈ మెయిన్స్ పేపర్–2 (బిఆర్క్) ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. ఆదివారం ఫలితాలు విడుదలైన అనంతరం విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మొదటి విడత నిర్వహించిన బీఆర్క్ ఫలితాల్లో సాయినేహా 99.29, జశ్వంత్ 99.26, హామిక 99.22, సాయి చరణ్ 99.09 పర్సంటైల్‌తో ప్రతిభ కనబర్చారన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**రఘునాథపాలెం:** మండలంలోని మంచుకొండ జెడ్పీ హైస్కూల్ 2003–2004 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 21 సంవత్సరాల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు. అప్పటి హెచ్ఎం విజయ్ కుమార్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఆనంద రావు, విజయ, మెర్సీ రజిని, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, నరసింహారావు, శ్యామ్, కరుణకుమారి శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.